# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 09-01-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- రైతులు, భూ యజమానుల ఆస్తులకు భద్రత కల్పించేలా కొత్త సాంకేతికతతో రూపొందించిన పాస్ పుస్తకాల పంపిణీకీ శ్రీకారం చుట్టామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.
- మన పండుగల సంస్కృతి సంప్రదాయాల మూలాలను భావి తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మన అందరిపైనా ఉందని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.
- సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను బలోపేతం చేసేందుకు "క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాంను తీసుకురానున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.
- విశాఖపట్నం వేదికగా లైట్ హౌస్ ఫెస్టివల్ 3.0 కొద్దిసేపటి క్రితం ప్రారంభమయింది.

====================

రైతులు, భూ యజమానుల ఆస్తులకు భద్రత కల్పించేలా కొత్త సాంకేతికతతో రూపొందించిన పాస్ పుస్తకాల పంపిణీకీ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా మండపేట నియోజకవర్గం రాయవరంలో మీ భూమి-మీహక్కు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పూర్వీకుల నుంచి సంక్రమించిన, స్వార్జితమైన భూమితో రైతులకు ఓ అనుబంధం ఉంటుదన్నారు. కరోనా సమయంలోనూ రైతులు పనిచేసి అందరికీ అన్నం పెట్టారని గుర్తుచేశారు. అటువంటి రైతుకు ఎటువంటి అవినీతికి తావు లేకుండా పాస్ పుస్తకాలు పంపిణీ చేసేలా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలన్నారు. జనవరి 2వ తేదీ నుంచి గ్రామ సభల ద్వారా రైతులకు, భూ యజమానులకు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని, వచ్చే నెలలో మళ్లీ సర్వే చేసి పాస్‌బుక్‌లు అందిస్తామని ముఖ్యమంత్రి వివరిస్తూ...

(వాయిస్...30 సెకన్లు)

====================

మన పండుగల సంస్కృతి సంప్రదాయాల మూలాలను భావి తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మన అందరిపైనా ఉందని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అన్నారు. పిఠాపురంలో ఈరోజు నిర్వహించిన 'పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాలు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, తెలుగు లోగిళ్లను వెలుగు వాకిళ్లుగా మార్చే సంక్రాంతి పండగను ప్రతీఒక్కరూ మతాలకు అతీతంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. సంక్రాంతి అనేది ప్రత్యేకంగా ఒక మతానికి నిర్దేశించిన పండుగ కాదని, మన సనాతన ధర్మ మూలాల్లో చెప్పే ప్రకృతి ఆరాధన పండుగ అన్నారు. ఎన్నో ఆచారాలు, సంప్రదాయాలు, సంస్కృతులు, వైజ్ఞానికపరమైన అంశాలు ఈ వేడుకలో దాగి ఉన్నాయని ఉపముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్...28 సెకన్లు)

====================

విశాఖపట్నం వైభవాన్ని మరింత చాటిచెప్పేలా పోర్ట్స్, షిప్పింగ్, ఓడరేవుల శాఖ ఆధ్వర్యంలో లైట్ హౌస్ ఫెస్టివల్ 3.0 కొద్దిసేపటి క్రితం ప్రారంభమయింది. సముద్ర వారసత్వాన్ని ప్రోత్సహించడం, లైట్ హౌస్ టూరిజాన్ని విస్తరించడం, తీర ప్రాంత ప్రజలను భాగస్వామ్యులను చేయడం లక్ష్యంగా ఈ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలకు మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు, కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జల మార్గాల శాఖా మంత్రి సర్బానంద సోనోవాల్, రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేశ్ తదితరులు హాజరయ్యారు. దీనిలో భాగంగా స్థానిక ఎం.జి.ఎం పార్క్ లో ఏర్పాటు చేసిన లైట్ హౌజ్ ఫెస్టివల్ స్టాల్స్ ను కేంద్ర పోర్ట్స్, షిప్పింగ్ శాఖ సెక్రటరీ విజయ్ కుమార్ ప్రారంభించారు. గతంలో గోవా, పూరీ నగరాల్లో లైట్ హౌస్ ఫెస్టివల్‌ను విజయవంతంగా నిర్వహించిన అనుభవంతో, విశాఖలో ఈసారి మరింత వైభవంగా నిర్వహించేందుకు అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

====================

విరామం

====================

ఆరోగ్యాంధ్రప్రదేశ్ నిర్మాణంలో అందరూ భాగస్వామ్యం కావాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఉన్న అన్ని ఆసుపత్రుల సూపరింటెండెంట్‌లు, బోధనాస్పత్రుల ప్రిన్సిపాళ్లతో మంత్రి ఈరోజు విజయవాడలో ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు కీలక సూచనలు చేశారు. మెరుగైన ఆరోగ్య సేవలు, నాణ్యమైన వైద్య, విద్య అందించాలని దిశానిర్దేశం చేశారు. వైద్య రంగంలో ప్రతికూలతలు ఎదుర్కొంటూనే సేవలందించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులకు ఉన్నత విద్య, ఉత్తమ వైద్యం, చికిత్స లక్ష్యంగా పీపీపీ విధానాన్ని ప్రభుత్వ అమలు చేస్తోందని సత్యకుమార్ తెలిపారు.

====================

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం నాటికి విశాఖపట్నం నుంచి అనుసంధానించబడిన ఏడు అప్రోచ్ రోడ్లను పూర్తిచేయాలని విశాఖ పార్లమెంటు సభ్యులు మతుకుమిల్లి శ్రీ భరత్ అధికారులకు స్పష్టం చేశారు. విశాఖపట్నం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశంలో ఇన్చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామితో కలిసి వివిధ అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రహదారి పనుల పురోగతిపై ప్రతినెల లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలని, ప్రతివారం తనకు ప్రగతి నివేదిక అందజేయాలన్నారు. రోడ్ల విస్తరణకు స్థల సేకరణ, టి.డి.ఆర్ అంశాలు త్వరితగతిన పరిష్కరించి పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు.

====================

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ (ఎంఎస్ఎంఈ) లను బలోపేతం చేసేందుకు “క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం (CDP)” తీసుకురానున్నామని ఎమ్.ఎస్.ఎం.ఈ., సెర్ప్ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈరోజు అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పబ్లిసిటీ సెల్లో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. దాని ఫలితంగానే 200 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో రూపొందించిన “ఆంధ్రప్రదేశ్ క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం (AP-CDP)”కు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రాబోయే ఐదు సంవత్సరాల్లో రాష్ట్రవ్యాప్తంగా 45 కామన్ ఫెసిలిటీ సెంటర్లు(CFC) స్థాపించబడతాయని, ఈ సెంటర్స్ ద్వారా ప్రింటింగ్, అగ్రి-టేస్డ్, గోల్డ్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లో సాంకేతిక సదుపాయాలు, ప్యాకేజింగ్ యూనిట్లు, జాబ్ వర్క్ ఫెసిలిటీస్ ఏర్పాటు కానున్నాయని మంత్రి తెలియజేస్తూ...

(వాయిస్…26 సెకన్లు)

====================

వీబీ జీ రామ్ జీ చట్టంపై పాత్రికేయులకు అవగాహన కల్పించేందుకు “వార్తాలాప్” మీడియా వర్క్ షాప్ ను విజయనగరంలో ఈరోజు నిర్వహించారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ (విజయవాడ), ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, విజయవాడ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డైరెక్టర్ జి.సురేష్ కుమార్, ఎన్.ఆర్.ఈ.జీ.ఎస్ ఏపీ డైరెక్టర్ షణ్ముఖ్ కుమార్, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు కమిషనర్ ఎం.శివ ప్రసాద్, సీబీసీ ఆర్వో ఆర్.రమేష్ చంద్ర, విజయనగరం డ్వామా పథక సంచాలకులు శారదా దేవి తదితరులు పాల్గొని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు అవగాహన కల్పించారు. మారిన సామాజిక, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా.. పారదర్శకతలో భాగంగా ఉపాధి హామీ చట్టాన్ని బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం వీబీ జీ రామ్ జీ చట్టాన్ని ప్రతిపాదించినట్లు పలువురు వక్తలు తెలిపారు. ఈ చట్టం 2047 నాటికి వికసిత్ భారతాన్ని ఆవిష్కరించాలనే దార్శనిక ఉద్దేశానికి అనుగుణంగా పని చేస్తుందని తెలిపారు.

=====================

=====================